
**అప్పుడే** ఏడ్చినట్లున్న ఆకాశం తెల్లని మబ్బు కర్చీఫుతో ముఖం తుడుచుకుంటోంది.

కొత్త పెళ్ళికూతురిలా సిగ్గు లొలకబోస్తూ మధ్య మధ్య మబ్బు మేలిముసుగును కాస్త



## అల్లంశెట్టి వెంకటస్వామి బాబు

కాస్త తొలగిస్తూ మళ్ళీ వేసుకుంటూ, పెళ్ళి మంటపంలోకి వెళ్ళే నూతన వధువులా తడబడే అడుగులతోనెమ్మదిగా, ఒయ్యారంగా వస్తున్నాడు సూరీడు తన శతసహస్ర కిరణాలతో ఈ లోకంలోకి.

మూడురోజుల్నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కావడంతో గూళ్ళలో మునగదీసుకు పడుకున్న పక్షి సంతతి రెక్కలు విప్పార్చి హాయిగా, ఆనందంగా కేకలు వేసుకుంటూ బయలుదేరాయి గగనవిహారానికి.

కాలువలు గట్టిన వర్షపు నీటిలో కాగితప్పడవలు వదిలి కేరింతలు కొట్టుకుంటూ అల్లరి చేస్తున్నారు చిన్నారి పాపలు.

రేయింబవళ్ళు తెరిపిలేని వర్షం కావడమూ లాన కూర్చుని కూర్చుని, మంచంమీద పడుకుని పడుకుని కాళ్ళు పట్టుకుపోయినట్లయి, వాన వెలవడంతో హాయిగా ఒక నిట్టూర్పు విడిచి బయటకొచ్చి సూర్యభగవానుడికో నమస్కారం పారేసి పైకండువా భుజాన వేసుకొని చేతికర్ర పుచ్చుకుని బయలుదేరాడు అనంతరామయ్య అలా ఊళ్ళోకి కాస్సేపు తిరిగి రావడానికి.

పెచ్చులూడిపోయిన చోట అతుకులు వేసుకుంటూ, కూలిపడిపోయిన గోడలు బాగు చేసుకుంటూ నిలువ ఉండిపోయిన నీటిని కాలువలు చేసి బయటికి వదులుతూ ఎవరి పనిలో వాళ్ళున్నారు బీదా బిక్కీ జనం.

తస్సదియ్య! ఈ వాన ఎంత వస్తేసింది? అనుకున్నాడు అనంతరామయ్య. తనది గట్టి ఇనప్పెట్టెలాంటి పూర్వీకుల ఇల్లు కాబట్టి వానదెబ్బ తెలిసిరాలేదు అనంతరామయ్యకి. కాస్సేపు అలా అలా తిరిగి ఎదురువడ్డ వాళ్ళ పలకరింపులు అందుకూంటూ, కుశల ప్రశ్నలు వేసుకుంటూ నడుస్తున్నాడు. రాములవారి మందిరంలోంచి కేకలు వినబడుతున్నాయి. పేకాట మంచి జోరుమీద నడుస్తోంది. పనీపాటా ఎండా వానా ఏమీలేదు వీళ్ళకి. వినుక్కుంటూ మందిరం దాటి ముందుకు నడిచేడు. ఆ గుంపులో తన పుత్రరత్నంకూడా ఉంటాడని తెలుసు అనంతరామయ్యకి.

కాళ్ళు నొప్పులు పుట్టేదాకా కాసేపు నడిచి రచ్చబండ దగ్గరకొచ్చి కూర్చున్నాడు. అక్కడికొచ్చి కూర్చుంటే ఎంతో హాయిగా, చిన్ననాటి నేస్తాన్ని కలిసినట్టు, వెచ్చని తల్లి ఒడిలో తల పెట్టుకుని నిద్రపోయినట్లు అనుభూతి పొందుతాడు. ఆ రచ్చబండకీ, ఆ రచ్చబండని ఎండకీ వానకీ తన విశాలమైన బాహువులతో కాపుకాస్తూ ఏపుగా పెరిగి నలు దిక్కులకీ విస్తరించుకుని ఉన్న ఆ మఱ్ఱి చెట్టుకీ, పండి ఎండి రాలిపోవడానికి సిద్ధంగా ఉన్న అనంతరామయ్యకీ అంతటి అవినాభావ సంబంధముంది. కష్టాలు సుఖాలు, బాధలు బాధ్యతలు అక్కడే నెమరువేసుకుంటాడు. అక్కడే ఆ చెట్టుతో, ఆ రచ్చబండతో చెప్పుకుంటాడు. ఒక్కోసారి ఎవ్వరూ చూడకుండా కళ్ళ నీళ్ళు పెట్టుకుంటాడు. భార్య పోయిం దగ్గర్నుంచీ ఇంతకన్నా ఈ లోకంలో నమ్మదగ్గ వాళ్ళూ, ఆత్మీయులూ ఎవ్వరూ కనిపించలేదు అతనికి. గుండెలో భారం తగ్గాక ఇంటిముఖం పడతాడు. ఇంట్లో ఎక్కువ సేపు ఉండడు. స్నానానికి, భోజనానికి తప్పిస్తే సాధ్యమయినంతవరకు ఇక్కడే గడిపేస్తుంటాడు. లేకపోతే పొలం వెళ్ళి దున్నించడం, దమ్ము చేయించడం, నాట్లు వేయించడం, ఏ సమయానికి ఏ మందు వాడాలో ఎప్పటికప్పుడు చూసుకుని ఆ ప్రకారం చేయించడం చేస్తుంటాడు. ఈ వ్యవహారాలు కొడు కసలు పట్టించుకోడు. ఎంత సేపటికీ తన సరదా లేమిటో, తానేమిటో!

ఇస్త్రీ మడత నలగనివ్వడు. ఉంగరాల వేళ్ళసందున సిగరెట్ ఆరనివ్వడు. బట్టలకు సెంటు ఘుమఘుమలు తగ్గనివ్వడు. రామమందిరంలో పేకాట వదిలిపెట్టడు. పట్నంలో సినిమామారిందంటే ఆరు నూరయినా ఆఖరికి ఆరోజు తుఫాను కావచ్చు, చూడకుండా మాత్రం పోనివ్వడు. కానీ పొలం వ్యవహారం, ఇంటి వ్యవహారం మాత్రం అసలు పట్టించుకోడు. అదేమంటే- నా కేమిటి? ఇరవయ్యెకరాల ఆసామిని తిని కూర్చుంటే మాత్రం జరగదా! కవులు కిచ్చి పారేస్తాను అంటాడు.

అయితే తనకేనా జరగనిది? కష్టపడి

సంపాదించిన గనిగడ్డలాంటి పొలం అదీ. ఇంకెవ్వరి చేతుల్లోనయినా పడితే ఇంకేమన్నా ఉందా? సరయిన పోషణ చెయ్యకుండా పాడు పెట్టరూ! తాను బ్రతికుండగా మాత్రం ఆ పని జరగనివ్వడు. తాను పోయింతర్వాత ఎవరెట్టా బోతే తనకేం? ఏ ఏట్లో కలిస్తే తనకేం?

"పొలాన్ని కవులి కివ్వడమంటే కన్నతల్లిని గొంతు పి^సికి చంపడమే- ఈ చేతుల్తో మాత్రం ఆ పని చెయ్యను, చెయ్యనివ్వను" అంటాడు అతను. "అయితే నీ ఖర్మ! నువ్వే చూసుకో! ఆ తగలాటం మాత్రం నాకు తగిలించకు" అని తనకే తగిలించి తప్పుకున్నాడు కొడుకు. అవును, వాడి కేం తెలుస్తుంది ఆ బాధ? రాత్రింబవళ్ళు ఎండనకా, వాననకా, శ్రమించి సంపాదించిన వాడికి తెలుస్తుందిగాని.

ఇక వాడి పెళ్ళాం అంటే తన కోడలు సరేసరి. చీరలు కొనుక్కోవడం, నగలు కొనుక్కోవడం, చాటుగా అవీ ఇవీ అమ్మి కూడబెట్టి పుట్టింటికి చేరవేసుకోడం. కొంప గుండమయిపోతోంది. ఊళ్ళో అప్పుకూడా ఉన్నదని వినికిడి. ఒకళ్ళిద్దరు తన చెవిని చూచాయగా వే^సినట్లు గుర్తు. తాను గట్టిగా పట్టుకు రాబట్టి సరిపోయిందిగాని, లేకపోతే ఈపాటికి ఉన్న పొలం కాస్త అమ్ముకుని బజార్న పడేవాళ్ళు. కొడు కొక్కడని గారాబంగా పెంచి నందుకు తగిన శాస్తే చేశాడు. అయినా

# మనిషి బ్రతుకింతే!




ఇంతకీ ఇదంతా తన తలరాత. ఆ మునల్దే కనక ఉన్నట్లయితే తన కీ బాధ ఉండేదా, వాళ్ళ ఆటలు సాగనిచ్చేదా? ఎవర్నెక్కడ ఎంతలో ఉంచాలో అంతలోనే ఉంచేది.

ఇంత కష్టపడి ఇల్లు కనిపెట్టుకుని కుక్కలా చాకిరి చేస్తున్నందుకు తనకు లభించే దేమిటి? నసుగుళ్ళు, చీదరింపులు, మూ తి తిప్పుకోవడాలు ముక్కు విరుచుకోవడాలు. కమ్మని తిండికి ముఖం వాచి జిహ్వా చచ్చిపోయింది. ఏం వండుకుంటారో ఏమిటో! ఒక్కోసారి ఇంట్లో ఉన్నప్పుడు తాళింపులు ఘమ ఘమ లాడిపోతాయి. తన దగ్గరి కొచ్చేనరికి చద్దన్నం, చద్దికూరలు, నీళ్ళ మజ్జిగ.

ఒక్కోసారి ఏడుపుకూడా వస్తుంది. కానీ ఏం చెయ్యడం? ఒంట్లో ఓపిక చచ్చిపోయింది. అదేమన్నా అంటే ఇంతే మేం పెట్టేది. తింటే తిను, లేకపోతే లేదు అనేరంత మాత్రపుది కోడలు. ఆ మాట అనిపించుకోవడం తన కిష్టం లేదు. బ్రతికి నన్నాళ్ళు రాజాలా తిరిగాడు, రాజాలానే ఒక్కళ్ళతో ఒక్కమాట అనిపించుకోకుండా బతికాడు. ఆ భోగమంతా దానితోనే పోయింది. నన్ను దిక్కుమాలినోణ్ణి చే "ిసి తన సుఖం తాను చూసుకుంది. భార్య గుర్తుకొచ్చినప్పుడల్లా మౌనంగా రోదిస్తాడు అనంతరామయ్య.

ఎవరైనా ఎంత నిద్రలో ఉన్నా లేపి "నీకు శత్రువు లెవరయ్యా?" అని అడిగితే తడుము కోకుండా జవాబు చెప్పేస్తాడు "నా భార్య" అని. ఎందుకని మళ్ళీ ప్రశ్ని స్తే "నా ఖర్మానికి నన్నిక్కడ వదిలే "ిసి అదిమాత్రం తన సుఖం తాను చూసుకుని వెళ్ళిపోయింది. మగాడికి ఇంతకన్నా నరకం ఏముంది చెప్పు? అనలు భార్య అవసరం వయసులో కాదు, ఇప్పుడు" అంటాడు.

"ఏం, బావా! ఒక్కడివే కూర్చున్నావ్?" నారయ్యొచ్చేడు పొగాకు పాయలు తీసుకుంటూ. అనంతరామయ్య ఇబ్బందిగా కదిలేడు. ఈ నారయ్య వచ్చాడంటే ఒక్కమాటతో పోనివ్వడు. ఒక పట్టాన వదిలిపెట్టడు. చెవి కో "ిసిన నక్కలా ఒకటే వాగుడు అంతూ దరీ లేకుండా. అవతలివాడు ఏదో సాకుతో దులపరించుకుపోతే తప్ప అతని వాక్ప్రవాహానికి ఆనకట్ట పడదు. ఇందులో అనంతరామయ్యకి నచ్చని విషయం మరోటుంది. ఎవరికీ ఇబ్బంది కలిగించని విషయాలు ఎంత సేపు మాట్లాడుకున్నా బాధ లేదు. కానీ అలా ఊరుకోడే! ఎలా సేకరించుకు వస్తాడో ఏమో ఊళ్ళోవాళ్ళ కుటుంబ రహస్యాలన్నీ ఏకరువు పెడుతుంటాడు. అలా...అలా వచ్చి మాటల్లో పెట్టి ఎదుటి వ్యక్తి కుటుంబ రహస్యాలన్నీ లాగాలని ప్రయత్నిస్తుంటాడు. విన్నవాడు అంతటితో ఊరుకుంటే అనలు నమ స్యే ఉండకపోను. ఈ విషయాలు మరోడి దగ్గర మరోడి దగ్గర వాగుతాడు. ఇలా వాగి వాగి




ఒకట్రెండు సార్లు తన్నులుకూడా తినబోయి తప్పించుకున్నాడు. అయినా మనిషిమాత్రం మారలేదు. అనలు బుద్ధి ఎక్కడికి పోతుంది? కుక్క బుద్ధి! పుర్రెతో పుట్టిన బుద్ధి పుడకలతోగాని పోదన్నారు.

"దీన్దుంపతెగ! మూ ద్రోజుల్నుంచి ఒకటే దంచికొడుతోంది, బావా, వెధవ్వాన కాస్తంత ఊపిరికూడా పీల్చుకోనివ్వకుండా! పంట ఈ ఏడు విరగ్గా "ిసం దనుకున్నామా! మళ్ళీ ఈ వాన తెచ్చిపెట్టాడు మాయదారి దేవుడు. మడుసులకే అనుకున్నా ఆ దేవుడికికూడా ఉంది చువ్వనాతి బుద్ధి. ఒక సంవత్సరమైతే పోనీలే అనుకోవచ్చు. ప్రతి సంవత్సరవూ అంతే నయిపాయె! ఆరుగాలవూ చాకిరి చే "ిసి చే "ిసి తినబోయేనరికల్లా ఆ వానదేవుడు లాక్కెల్లి పోతన్నాడు. అట్టయితే ఈ రైతు బాగుపడేదెట్టా? మందుకట్టలు సూస్తంటే మండిపోతన్నాయి. కూలిరేట్లు చూద్దామా అంతూ పొంతూ ఉండకపాయె! ఇటు కూలోడికీ బాదలేదు, అటు మోతుబరి రైతుకీ బాదలేదు. మధ్యలో మనబోటి మధ్యతరగతి రైతులే మట్టిగొట్టుకు పోతన్నారు. చేటుకాల వొచ్చింది, బావా!"


"........."

"ఈ వాన ఒక్క పదిరోజులాగి వచ్చినట్లయితే ఈ లోపల కుప్పలు పడిపోయేవి చాలా వరకు. ఈ రో జట్టా ఊరు బయటికెళ్ళి సూద్దునుగదా- కోతకో "ిసిన చేలల్లో ఓదులు నీళ్ళ మీద తేలుతున్నాయి. మిగతా చేలల్లో మొక్కలు వంగిపోయి నీళ్ళలో మునిగిపోయాయి. కళ్ళమ్మట నీ ళ్ళొచ్చా యనుకో! ఎవరి పొలాలయితే ఏం, బావా! అయినా ను వ్వదృష్టవంతుడివిలే! వారం రోజులముందే కుప్పేసుక్కూర్చున్నావు. అంత తెలివిగల్లోడివి గాబట్టే '"ిసరి' నడుచుకుంటూ వచ్చింది. ఒక విధంగా కొంతలో కొంత నేనూ బయటపడి నట్టేననుకో. ఇంకా కోత కొయ్యలా! గింజ చాలామటుకు రాలిపోయుంటది." పొగాకు సెజు కొలిచి ముక్కలు చే "ిసి చుట్ట చుట్టు కుంటూ ఎదుటి మనిషి మారుమాటాడే అవకాశం ఇవ్వకుండా బడబడ వాగేస్తున్నాడు నారయ్య.

మౌనంగా ఆలకిస్తూ తల వంకిస్తూ ఉండిపోయాడు అనంతరామయ్య. పొగాకు కమ్మని వానన వస్తోంది. వాతావరణం కాస్త చలిచలిగా ఉంది. ఒక ముక్కతీ "ిసి ముక్కు దగ్గర పెట్టుకుని వానన పీల్చేడు. "ఇది స్వచ్ఛమైన చేబోలు పొగాకు, బావా! మాబావ్మర్ది పంపించేడు. తాగు" అంటూ తన చేతిలోది ఇచ్చే "ిసి మళ్ళీ తా నొకటి చుట్టుకున్నాడు.

ఇద్దరూ కలి "ిసి వెలిగించి గుప్పు గుప్పున పొగ వదులుతూ కూర్చుండిపోయారు. అనలు విషయాలకు రాకముందే వీణ్ణి ఎలా వదిలించుకుందామాఅని ఆలోచనలో పడిపోయేడు అనంతరామయ్య. తాను లేచి వెళ్ళిపోవడమా లేక వీణ్ణి ఇక్కణ్ణుంచి పంపించడమా? రెండోది అసంభవం కాబట్టి తాను వెళ్ళిపోవడానికై సాకులకై ఆలోచిస్తున్నాడు.

"చేటుకాల వొచ్చింది, బావా! ఈ రోజుల్లో కుర్రనాయాళ్ళకి అనలు చెప్పలేకండా ఉన్నాం. వాళ్ళ సరదా లేవిటో వాళ్ళేవిటో! ఇంత కష్టపడి సంపాయించిందంతా ఆళ్ళ చేతుల్లో పెడతన్నావా? అయ్యకీ, అమ్మకీ కొనుక్కోమని ఒక పావలా. డబ్బులుకూడా ఇవ్వరు. నేనుమాత్రం ఈ విషయంలో చాలా తెలివిగల వ్నేశాన్లే. ఉన్నదంతా మాచేతుల్లో పెట్టుక్కూర్చున్నాం. మొన్న మాపెద్దోడు భాగాలు పంచమని కూర్చున్నాడు. 'కొంపలో ఉండి అందరితోపాటు. చాకిరీ చేసుకుతింటే తినండి. లేకపోతే బయటి కెళ్ళిపోయి మీ బతుకులు మీరు




బతకండి. అంతేగాని మాకు సిలోళ్ళ అరం గడిచేదాకా అందులో ఒక్క సెంటుగూడా దక్కదు' అని కరాకండీగా చెప్పేశా! బాగాలు పెట్టడానికి ఆళ్ళ తాత సంపాయించిన ఆస్తే వీఁ లేదిక్కడ. నా కష్టార్జిత విఁది. ఎంత వల్లెటూళ్ళో ఉన్నామటుకు ఆమాత్రం న్యాయ సూత్రాలు తెలుసుకోకండా బతుకుతున్నా మా" కాస్త ఆగి గాలి పీల్చుకుని "మాఅక్కే గనకుంటే నీకీ బాధలుండకపోను" అన్నాడు.

వక్కలో బాంబు పేలిన ట్లదిరిపోయాడు అనంతరామయ్య. ప్రస్తావన ఎక్కడి దాకయి తే రాగూడదనుకున్నాడో అక్కడిదాకా వచ్చే సింది. అప్పటిదాకా ఎంతో మధురంగా ఆనందా న్నిచ్చిన నోట్లో చుట్టముక్క జెర్రిగొ ర్డు తోకలాగా అటూ ఇటూ కదులుతూ కంపరా న్ని కలగజేసింది. తీసి వాడి ముఖాన కొడదామన్నంత కోపం వచ్చింది. ఎదుటివా డి బలహీనతల మీద ఎలా దెబ్బకొట్టి విష యాలు రాబట్టాలో వీడికి వెన్నతో పెట్టిన విద్య. నాకే వేశాడు గాలం. వీడి ఎరలో వడగూడదు. అలాగని వెంటనే లేచిపోకూడ దు. ఏం చేద్దామా అనుకున్నంతలో ఆ దోవన బోతున్న దానయ్యెవరో కనిపించేసరికి ప్రాణం లేచి వచ్చినట్లయి అవసరం లేకపోయినా అతణ్ణి పిలిచి లోకాభిరామాయణం మొదలెట్టా డు అనంతరామయ్య, పక్కనే ఉన్న నారయ్య ను మర్చిపోయినట్లు.

"అద్సరేగాని, బావా! ఆ రామయ్యగారి యల్లమంద లేడూ! ఆడి పెళ్ళాం యవ్వారం విన్నావా నువ్వు?" ఏదో అతి ముఖ్యమైన రహస్యం చెబుతున్నట్టు దగ్గరగా జరిగేడు నారయ్య. అవతలి వ్యక్తి కాస్సేపు మాట్లాడి వెళ్ళిపోగానే.

"మన కెందుకు పోనీరా-లోకుల గొడవ లు." విసుగ్గా అన్నాడు అనంతరామయ్య మరోవైపుకు ముఖం తిప్పుకుని.

"అట్టాగని ఊరుకోలేంగా, బావా! రే పేదన్నా అఘాయిత్యంగాని, మరింకోటిగాని మరింకో టిగాని జరిగితే ఆ చెడ్డ పేరు మనూరిక్కాదూ వచ్చేది? ఒక్కళ్ళుమూలాన లోకం దృష్టిలో ఊరు ఊరంతా చెడిపోద్దాయె! బయటికెళ్తే అసలు మనకి విలు వుంటదా అంట! అస లా యల్లమందగాడికి ఏం జానుకొనో ఆ తల పొగరు! ఆడికన్నా పెద్దోళ్ళంగదా. కాస్త నెమ్మదిగా, మర్యాదగా ఉండొద్దా! చిన్నా పెద్దా లేకండా తలబిరుసుగా ఎంత మాటబడితే అంత మాట మాట్లాడేస్తాడు. కొంపలో పెళ్ళాని కి బుద్ధి..."

"ఒరే, నారిగా! నన్నొల్లి పొమ్మంటావా? కాసేపు కూర్చోమంటావా? అయినా ఎన్నిసా ర్లు చెప్పాల్రా నీకు? ఒకళ్ళ సంగతి నా దగ్గరె త్తుకు రావద్దని? ఒకళ్ళ గురించి మనం మాట్లాడుకునేప్పుడు మనల్ని గురించి అవ తల ఎంతమంది మాట్లాడుకుంటున్నారో అని ఆలోచించుకోవాలి. ఎవడి సమస్యలు వాడు పరిష్కరించుకునే వరకే తాడు తెగిపోతంది. మరొకళ్ళ విషయాలు మన కెందుకు?" మందలింపుగా అన్నాడు అనంతరామయ్య రవంత కోపంగానే.

ఆ మాటతో నారయ్యా నోరు తక్కున మూ త వడ్డది. ముఖంలో కాస్త కళ తప్పింది. కాసే పు మాట్లాడకుండా రోడ్డువంక చూస్తూ కూర్చుండిపోయేడు. కాలం గడుస్తోంది. అనంతరామయ్య లేచి వెళ్ళడాని కుద్యుక్తుడ య్యేడు.

"అబ్బా యేవంటున్నాడు?" భుజంమీది కండువా నేలమీద పరిచి, పాలసముద్రంలో శేషశయ్యమీద పవళించిన శ్రీమహావిష్ణువులా పోజుపెట్టి మరో బాణం వదిలేడు నారయ్య.

ఫెళ్ళున నవ్వు ఎగదన్నుకొచ్చి బలవంతా న నిగ్రహించుకున్నాడు అనంతరామయ్య. వీడి దుంపతెగ. ఇప్పుడేగా వీడికి గడ్డి పెట్టిం ది? కథ మళ్ళీ మొదటికే వచ్చిందన్నమాట! కుక్కతోకలాంటిది వీడి బుద్ధి. అటు దిరిగి, ఇటుదిరిగి మళ్ళీ నాకే వేశాడు వాలం. అయి నా వీడితో నాకెందుకు? "అవతల నాకు చానా పనుందిగాని, నే వెళ్తున్నా్రా" అంటూ లేచి వెనక్కికూడా తిరిగి చూడకుండా ఇంటి దారి పట్టేడు అనంతరామయ్య.

"ఒకపట్టాన కొరుకుడువడ డీ ముసలి ముండా కొడుకు." వెనకనుంచి నారయ్యా గొణుగుడు వినిపించకపోలేదు అనంతరామ య్యకు.

×× ×× ××

ఆ రోజు ఉదయం లేవగానే చక్కగా ము స్తాబై, తెల్లటి మడత నలగని ఇస్త్రీ చొక్కా తొడుక్కుని, గ్లాస్కో పంచె లుంగీగా బిగ్గట్టి, నోటితో సిగరెట్ పొగ గుప్పుగుప్పున వదులు తూ బయటి వరండాలో కొచ్చి చెప్పు లేసు కుని ఎక్కడికో గబగబా కొంపలంటుకుపోయి నట్లు వెళ్తున్నాడు శోభనాద్రి.

"ఈరోజు కాస్త ఆ పొలంపై పెళ్ళి కల్లం చేయించి రారా. రెండు మూ డురోజు లాగి కల్లం బాగా ఆరినాక కుప్ప కొట్టించుకోవచ్చు" అన్నాడు అనంతరామయ్య లోపల చలిచలి గా ఉంటే ఆరుబయట నీరెండలో చలి కాచుకుంటూ.

"ఆ పనేదో నువ్వే చూసుకో. ఆ తగలాటం మాత్రం నాకు తగిలించకు. అసలు చెయ్యేపె ట్టలేనోడివి నెత్తినెందు కెత్తుకున్నావ్? నే నెప్పు డో చెప్పాను నీకు-మళ్ళీ మళ్ళీ నన్ను ఇసి గించొద్దు." చిర్రుబుర్రులాడుకుంటూ వెళ్ళిపో యేడు శోభనాద్రి.

రెండురోజుల్నుంచి ఒంట్లో నలతగా ఉంటోంది అనంతరామయ్యకు. కాస్త దూరం నడిస్తే చాలు ఆయాసం వచ్చేస్తోంది. పదిరో జులక్రితం కురిసిన వాననీళ్ళు బయటికి పోయేయి. నేల కాస్త ఆరింది. కొంతమంది కుప్పలుకూడా కొట్టించేసుకుంటున్నారు. ధాన్యం ఇంటికి వచ్చేస్తే తనకి కొంత బరువు తీరిపోతుంది. కొడుకుని వెళ్ళమంటే ఈమాట అన్నాడు. 'నేను చచ్చిందాకా నాకీ పని తప్పదులే' అనుకుంటూ భారంగా లేచి నాలుగు మెతుకులు కొరికి భోజనం అయింద నిపించి, ముక్కుతూ మూలుగుతూ పొలం బయలుదేరేడు అనంతరామయ్య కర్రపోటు వేసుకుంటూ.

కాస్త దూరం నడిచాక మంచినీళ్ళ బావి దగ్గర కోలాహలంగా ఉంటే ఆగి చెవులు రిక్కించి నిలబడ్డాడు. బావికి నాలుగిళ్ళ అవ తల పెద్ద పెద్దగా అరుపులు, ఏడుపులు వినబడుతున్నాయి. హడావిడిగా అటువైపు వెళ్తున్న ఓ వ్యక్తిని ఆపి అడిగేడు సంగతేమి టని.

"నీకు తెలీదా, మామా! పద్మనాబయ్య

పోయేడు" అన్నా డతను ఆశ్చర్యంగా, ఊరంతా తెలి సినాకూడా ఇంకా నీకు తెలియలేదా అన్నట్టు ముఖంపెట్టి.

"అరి! ఎప్పుడు?" అన్నాడు అనంతరామయ్య నొచ్చుకుంటూ.

"ఇయ్యాల తెల్లారగట్ట పొయ్యాడంట. పట్నంనుంచి కార్లో పొద్దున్నే తీసుకొచ్చారు."

"మరి ఆ అరుపు లేంటి? ఏదో తగూలాగుంది?"

"ఓ!అదా! పాపం, బతికినన్నాళ్ళూ మెహర్బా నీగా కొట్టుకొచ్చాడు. పోయాక అప్పు లొక్కొటీ బయట పడతన్నాయి. ఈ అప్పుల్తో నాకు వస్లేదంటే నాకు వస్లేదని కొడుకులు పోట్లాడుకుంటున్నారు" అని చెప్పి వడివడిగా వెళ్ళిపోయే డతను.

ఆ మాట విన్న తర్వాత అనంతరామయ్యకు కాలు ముందుకు సాగలేదు. పద్మనాభయ్య ఇంటివైపు కదిలేడు.


శవాన్ని ఆరుబయట గడ్డిమీద పడుకోబెట్టేరు. అతని భార్య ఓ పక్క స్పృహలేకుండా పడిఉంది. కూతుళ్ళు, చుట్టుపక్కల అమ్మలక్కలు ఆమెకు తెలివి తెప్పించడానికి ఉపచారాలు చేస్తున్నారు. కొస్త దూరాన ఓ పక్క అప్పులవాళ్ళూ, పద్మనాభయ్య కొడుకులూ పోట్లాడుకుంటున్నారు. అంతా గందరగోళంగా ఉంది.

కా స్సేపు అక్కడే నిలబడ్డాడు అనంతరామయ్య. అప్పులవాళ్ళతో కా సేపు పోట్లాడి ఆ తర్వాత తమలో తాము కలహించుకుని, తల్లిని, ఆరుబయట నిర్జీవంగా పడిఉన్న తండ్రిని వదిలే సి ఎవరికి వాళ్ళు వెళ్ళిపోవడానికి తయారయ్యేరు.

ఇక అక్కడ ఒక్క నిముషంకూడా ఉండ బుద్ధికాక రచ్చబండ దగ్గరకొచ్చి కూర్చున్నాడు అనంతరామయ్య. మనసంతా చికాకుగా ఉంది. 'ఎంత డాబుగా, ఎంత దర్జాగా, ఎంత దర్పంగా బతికాడు పద్మనాబయ్య! వరసగా రెండు దఫాలు గ్రామసర్పంచిగా చేశాడు. పైసా తినలేదు. ఊరు బాగు చేశాడు. మంచి పేరు సంపాయించుకున్నాడు. నలుగురు కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేశాడు. కొడుకులకి పెద్ద నదువులే చెప్పించాడు. ఏమయితేనేం? అంత బతుకూ బతికి చివరకి అనాథప్రేతమై పోతున్నాడు.

తనకన్నా పదేళ్ళు చిన్నేడు. చావుకీ వయసుకీ సంబంధ మేవింటిలే! రేపు తాను సచ్చిపోతే తన బతుకూ అంతేనా!

నెలరోజులు తీసుకున్నాడు మంచంలో. ఒక్కళ్ళున్నా వచ్చి అతీ గతీ కనుక్కున్నారా? ఒకళ్ళిద్దరు వచ్చినా సుట్టపు సూపుగా వచ్చి ఒకట్రెండు రోజు లుండి పోయారేగాని, అయ్యకి దగ్గిరుండి ఒక్కళ్ళయినా వైద్యం చేయించారా? తల్లిని ఊరడించారా! ఈనాడు పోయింతరవాత వచ్చారు అంతా కట్టగట్టుకుని, సంపాయిచ్చిందేవైనా ఉంటే మూ టగట్టుకు పోదావని. ఛీ! ఎదవ మడుసులు! ఎదవ జనములు! పద్మనాబయ్యకి బార్యన్నా ఉంది పక్కన, ఆలనా పాలనా చూట్టానికి. రేపు తాను మంచాన బడితే తన గతేవింటి?'




వెన్నులో ఒక్కసారిగా వణుకు ప్రారంభమయింది అనంతరామయ్యకు. ఇక పొలంకూడా పో బుద్ధికాక అలానే కూర్చుండిపోయేడు. అలా ఎంత సేపు కూర్చున్నాడో తెలియదు. దూరాన నారయ్య వస్తూ కనిపించేసరికి ఇష్టం లేకపోయినా అలానే లేచి కర్ర తాటించు కుంటూ ఇంటిముఖం పట్టాడు.

×× ×× ××

"తాతయ్యా! చలిగా లేదూ? ఈ మంచులో పడుకున్నా వంటే ఆరోగ్యం పాడవుతుంది గాని ను వ్వింటి కెళ్ళు. నీ బదులు నే నిక్కడ కావలా ఉంటాను. నువ్వు తెల్లవారి వద్దువుగాని." మంచంమీద వెల్లికిలా పడుకుని ఆకాశంలోకి చూస్తూ బ్రహ్మంగారి తత్త్వాన్ని కూని రాగం తీసుకుంటున్న అనంతరామయ్య పలకరింపు వినబడేసరికి ఈ లోకంలోకి వచ్చి పక్కకు తిరిగి చూ సేడు. ఎదురుగా పెద్ద మనవడు రాజారావు. ఆ ఊర్లో చదువైపోయి ఈ సంవత్సరమే పట్నంలో చేరేడు.

"ఎప్పు డొచ్చావురా?" ఆశ్చర్యంగా అడిగేడు.

"ఇంతకుముందే వచ్చా! రాగానే ఇంట్లో నీ సంగతి అడిగా. ను వ్విక్కడున్నావని చెప్పారు" అన్నాడు మంచంమీద కూర్చుంటూ.

"ఉత్తరం పత్తరం లేకుండా ఊడిపడ్డావేరా? సెలవు లేమైనా ఇచ్చా రేంటీ?"

"పరీక్ష ఫీజు కట్టాలి-ఎల్లుండే ఆఖరు రోజు. రే పెళ్ళిపోతున్నాను" అన్నాడు.

ఆ మనవ డంటే అనంతరామయ్యకు పంచప్రాణాలు. కావాలని తండ్రి పేరు పెట్టుకున్నాడు. అదీగాక తన ఆలనా పాలనా దగ్గగుండి చూ సేవాడు వా డొక్కడే. ఆ ఇంట్లో. నెల నెలా తన ఖర్చులకు డబ్బు తీసుకుపోయేప్పుడు అందులో పదో పరకో తనకు ఇచ్చిపోతుంటాడు ఏవయినా అవసరమైతే వాడుకోమని.

"ఈ సంవత్సరం పంట బాగా పండిందనుకుంటాను" అన్నాడు రాజారావు స్వగతంగా అనుకుంటున్నట్టు, వెన్నెల్లో ఎత్తుగా మెరి సిపోతున్న ధాన్యపురా సి కే సి కళ్ళింతలు చేసుకుని చూస్తూ. అవు నన్నట్టు తలాడించేడు అనంతరామయ్య.

"ఇక నువెళ్ళు, తాతయ్యా. నే నుంటాను." ఎంత సేపటికీ తాత కదలకపోయేసరికి విసుగుపుట్టి అన్నాడు రాజారావు.

"ఓరి పిచ్చి నన్నా సి! ఈ ఒక్కరోజు నువ్వుండగానే అయిపోయిందేంట్రా! సగం కుప్ప ఇంకా అక్కడే మిగిలిపోయి ఉంది. అదంతా అయిపోయి ధాన్యమంతా ఇంటికి జేర్చిగాని నే నెళ్ళటాని కీలుండదు." మన వడి అమాయకత్వానికి నవ్వుతూ అన్నాడు.

"అయితే నేనూ ఇక్కడే పడుకుంటా" అంటూ తాత ప్రక్కనే సర్దుకు పడుకున్నాడు రాజారావు.

×× ×× ××

గ్రీష్మం కన్నెర్ర జే సిందేమో తన కోపాగ్నితో లోకాన్ని మలమల మాడ్చేస్తోంది.

కొస్త దూరంలో రాములవారి మందిరంలోంచి మంగళతూర్య నాదాలు శ్రవణానందకరంగా వినిపిస్తున్నాయి.

ఆ రోజు శ్రీరామనవమి.

ఏటా జరిగే దేవుడి పెళ్ళి ఈ రోజు కూడా జరుగుతోంది. ఆలయం చుట్టూ విశాలమైన ప్రాంగణానికి పూర్తిగా తాటాకు పందిరి కప్పారు. మామిడాకుల తోరణాలతో, రంగురంగుల కాగితాలతో అలంకారాలు చేశారు. గుడికి సున్నం కొట్టించి, రంగులు వేశారు.

పట్టుచీరలకూ, బంగారు నగలకూ ఆ రోజు


చెఱ తప్పిందేమో-సంతోషం పట్టలేక అమ్మల క్కల ఒంటిమీద వగలబడుతున్నాయి.

పందిరిక్రింద రకరకాల మనుషులు రంగు రంగుల బట్టలతో చిన్నా పెద్దా, గొప్పా బీదా, ఆడా మగా తారతమ్యం లేకుండా క్షణం విశ్రాంతి లేకుండా వంది రంతా కలయ తిరుగుతున్నారు.

అవును మరి, దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలే!

భద్రాచలంలో రాములవారి కల్యాణ మహోత్సవ తతంగం ఎవరి ఇంట్లోంచో రేడి యోలో పెద్దగా వినిపిస్తోంది.

ఒకే దేవుడికి ఒకే ముహూర్తానికి ఎన్ని చోట్ల ఎన్ని వేల, లక్షల పెళ్ళిళ్ళో! పందిరికి నాలు గు వైపులా అమర్చిన మైకుల్లోంచి సినిమా పాటలు పెద్ద గోలగా ఊరంతా అదరగొడుతు న్నాయి. రాములవారి కల్యాణ మంటపానికి




కాస్త దూరంగా అరుగుమీద అప్పుడే వచ్చి కూర్చున్నాడు అనంతరామయ్య.

'అత్తమడుగు వాగులోన అత్తకూతురా! అడిగింది ఇచ్చుకో అత్త కూతురా'!

కాస్త దూరంలో ఒక రిద్దరు చిన్న పిల్లలు పాట కనుగుణంగా యాక్షన్ చేస్తూ గంతులు వేస్తున్నారు. కొంతమంది పెద్దవాళ్ళు చుట్టూ గుంపుగా మూ గి చోద్యం చూస్తూ నవ్వుతున్నా రు.

"నీ యవ్వ సిగదరగ! దేవుడి పెళ్ళికి ఈ యదవ పాట లేంటి? ఏ భక్తి పాటలో యేసుకో క!" పైకి ఎవ్వర్నీ ఏమీ అనలేక లోలోపలే విసుక్కున్నాడు.

"ఏం మాబా? అన్ని ఏర్పాట్లూ పూర్తి కాచొ చ్చినయ్యి. మూ ర్తం దగ్గర పడిపోతంది-కొ డుకూ కోడలూ ఏరీ?" ఓ పెద్ద అడిగేడు అనంతరామయ్యని.

"కబు రంపాలే-ఈపాటికి వస్తానే ఉంటా రు." మరొక వ్యక్తి అందుకున్నాడు జవాబుగా.

శ్రీరామనవమి రోజు స్వామివారి కల్యాణాని కి పీటలమీద కూర్చునే హక్కు తరతరాలుగా వస్తోంది అనంతరామయ్య కుటుంబీకులకు. ఆమధ్య ఎవరో దాయాదులు ఆ హక్కు తన్నుకుపోతే పట్టుదలమీద డబ్బు ఖర్చుకూ డా లెక్క చెయ్యకుండా హైకోర్టుదాకా వెళ్ళి తన సొంతం చేసుకున్నాడు అనంతరామ య్య.

ప్రతి సంవత్సరమూ ఈ సమయానికి పట్టుబట్టలు కట్టుకుని పీటలమీద కూర్చుని దేవుడి పెళ్ళి దగ్గరుండి ఘనంగా చేయించే వాళ్ళు తనూ, తన భార్యా. ఏడెనిమి దేళ్ళుగా -అంటే తన భార్య పోయిందగ్గర్నుంచి కొడుకూ, కోడలికి ఆ హక్కు భుక్తమయిపో యింది. ఆ రోజులు గుర్తుకొస్తుంటే ఒడ లంతా పులకరించిపోయింది అనంతరామ య్యకి. ముఖాన ఇంత బొట్టు పెట్టుకుని, నిండుగా పట్టుచీర చుట్టుకుని మహలక్ష్మిలా వేల జన సమూ హం మధ్యలో ఎత్తయిన ఆ వేదికమీద ఆవిడ తనప్రక్కన కూర్చుంటే ఎంతో గర్వంగా ఉండేది. జరిగిన వైభవాన్ని నెమరు వేసుకుంటుంటే కళ్ళు చెమర్చాయి.

కండువా దులిపి భుజాన వేసుకుని రచ్చ బండ దగ్గరి కొచ్చి కూర్చున్నాడు ముహూర్తం వేళకు వెళ్ళవచ్చని.

"ఏం బాబాయ్! అనలైనోడివి నువ్వే ఈడ కూచుంటే దేవుడి పెళ్ళి ఎట్టా జరుగుద్దయ్యా ?" ఆ దోవన పోతూ ఎవరో ప్రశ్నించేరు ఆగి.

"నేను లేకపోతే అక్కడేవీఁ ఆగిపోదు లేవ య్యా! కావల సినోళ్ళకోస మెప్పుడో కబు రెల్లిం ది. నువ్వెళ్ళు. నే తర్వా తొస్తాను నెమ్మదిగా" అన్నాడు. ఆ వ్యక్తి ముందుకు సాగిపోయేడు.

రోడ్డుమీది జనసంచారం కాస్త వేగం పుంజుకుంది. సమయం ఆసన్నం కావడంతో చీమలబారులా ఆ ఊళ్ళోని జనం గుడివైపు గా వెళ్తున్నారు.

'ఎవ రా వచ్చేది?' కళ్ళు చికిలించుకు చూ సేడు. 'సుబ్బులు కదూ...అవును, సుబ్బు లే! తనకి వరసకి వేలువిడిచిన మేనమామ కూతురు. చిన్నప్పుడు తన ఎదటికి రావటాని కే బయపడేది. మరదలు కావటంతో చతురు గా మాట్లాడేవాడు తాను. సిగ్గుతో తప్పుకు తిరిగేది. ఆ వక్కనే మనవఁరా లనుకుంటా ను. వెంటేసుకు వస్తోంది.

"ఏం, బావయ్యా! ఎవరికోసం చూస్తున్నా వు?" వెళ్తూనే సుబ్బులు పలకరించింది.

"నీ కోసవేఁనే!" అన్నాడు చిలిపిగా.

"చింత చచ్చినా ఇంకా పులుపు చావలా. ఏళ్ళొచ్చాయి ఎందుకూ?" చీదరించు కుంటూ, ఆగి చూస్తున్న మనవఁరా ల్నోక మొట్టు మొట్టి బరబరా ఈడ్చుకుపోయింది సుబ్బులు.

ఆ మాటకి కోపం రాలేదు గానీ చాలా ఏళ్ళ తర్వాత హాయిగా నవ్వుకున్నాడు అనంతరా మయ్య.

కా సేపటికి దూరంగా కొడుకూ, కోడలూ వస్తూ కనిపించేరు. అతనికి సమీపంగా వచ్చి కూడా తల వంచుకుని వెళ్ళిపోయేరు, పలక రించవల సి వస్తుందేమోనని. అనంతరామ య్య మనసు కాస్త చివుక్కుమంది కొడు కలా వెళ్ళిపోతుంటే. ఈ మధ్య కాలంలో ఇది అల వాటైపోయింది కాబట్టి అత న్నెక్కువగా బాధించలేదు.

ఈ హక్కుకోసం త నెంత బాధపడ్డాడో, ఎంత డబ్బు ధారపోశాడో, ఎన్ని చుట్లు కోర్టుల చుట్టూ, వకీళ్ళ చుట్టూ తిరిగేడో తనకు తెలు సు. పద్మనాభయ్య చనిపోవడం, అప్పుల పంపకంలో కొడుకులు పోట్లాడుకోవడం మన సులో మెదిలింది.

'తండ్రి సంపాయించిన ఆస్తులకూ, అధికా రాలకూ, హోదాలకూ వీళ్ళు వారసులు కానీ, తండ్రి విడిచివెళ్ళిన అప్పుకూ బాధ్యతలకూ బాధ్యులు కారు. ఆ తర్వాత ఆ మనిషి తలంపే ఉండదు. ఇదెక్కడి న్యాయమో మరి?' విరక్తిగా అనుకున్నాడు.

కా సేపు అక్కడే కూర్చుని గుడివైపు అడు గులు వే సేడు.

గుడి వెనుకగా లోపల ప్రవేశిస్తుంటే పకపక నవ్వులు వినిపించేయి అనంతరామయ్యకి. ఓ మూ లగా నీడలో రెండు ఆకారాలు కదిలి నట్లయి ఆగి చూ సేడు అనుమానం వచ్చి.

'ఆ పిల్ల ఎవరు?' కళ్ళు చికిలించుకు చూ సేడు. 'కల్యాణి కదూ? అవును, తన మనవఁరాలు కల్యాణే! అయితే వా డెవడు? రామయ్యగారి గోపాలం కొడుకు కాదూ? అయినా వీళ్ళు కిక్కడేం పని? పందిట్లో అంత మంది జనం ఉండగా, అక్కడ అంత సంద డి జరుగుతుంటే ఒంటరిగా ఇక్కడికి రావా

ల్సిన పనేవేటీ? అయినా దాని కెంత ధైర్యం? తనని చూ ిసకూడా లెక్కచెయ్యకుండా తిప్పుకుంటా వాడితో మాట్లాడుతోంది?'

కోపంతో ఆవైపు కదిలేడు-అయినా వాళ్ళు అక్కడ్నుంచి కదల్లేదు.

"ఇక్క డేం పనే నీకు?" కోపంగా ఇద్దర్నీ చూస్తూ గదిమేడు మనవ(రాల్ని.

"నోట్సు అడుగుతున్నాను." కాస్త భయప డినా పైకి బింకంగానే బదు లిచ్చింది కల్యా ణి. ఆ ఊరి స్కూల్లో పదవ తరగతి చదువుతు న్నారు వా ళ్ళిద్దరూ.

"పుస్తకాలు అడగటానికి ఇక్కడే తీరిక దొరికిందా? అయినా పందిట్లో అంతమంది జనం ఉండగా ఇక్కడికి రావాల్సిన పనే వొ(చ్చింది మీకు?" కాస్త స్వరం పెంచి గదిమే డు. ఆ మాటతో గుడ్లనీరు కుక్కుకుని తల వంచుకు వెళ్ళిపోయింది కల్యాణి. అదను చూ ిస ఆ కుర్రా డెప్పుడో జారుకున్నాడు.

'తన కంటబడ్డారు గాబట్టి సరిపోయింది. అనలే పల్లెటూరు-ఇంకెవరి కంటయినా పడి ఉంటే ఊర్ని పట్టుకోగలవా(? దీని కీ జన్మలో దీని బాబు పెళ్ళి చెయ్యగలడా? అయ్య దొక దారి, అమ్మ దొక దారి అయినప్పుడు పిల్ల లిట్టానే తయారవుతారు మరి.' కొడుకుమీద, కోడలుమీద పీకలదాకా కోపం వచ్చింది అనంతరామయ్యకి.

"ఏం నాన్నా! దా న్నెందుకు తిట్టావంట? వచ్చిం దగర్నుంచీ ఏడుస్తూ అన్నం తిన కుండా పడుకుంది?" అడిగేడు శోభనాద్రి ఇంటి కెళ్ళగానే.


పొలం కవులు కిచ్చిన రోజు లగాయతు మళ్ళీ ఈరోజే మాట్లాడ్డం. "నాలో ఓపిక చచ్చి పోయింది-నే నిక చెయ్యలేను. సొంతంగా చేసుకుంటావో, కవులు కిచ్చుకుంటావో ఇక అది నీ ఇష్టం." తెగే ిస చెప్పేడు అనంతరా మయ్య ధాన్యం పూర్తిగా ఇంటికి తరలించిన రోజున.

"ఆ ముక్క నీకు మొదట్లోనే చెప్పాను. కావాలని నువ్వే నెత్తి కెత్తుకున్నావు" అన్నాడు శోభనాద్రి. కవులి కి స్తే రాబడి తగ్గిపోతుందని మనసులో కాస్త బాధగానే ఉంది శోభనాద్రికి. ఆ రోజునుంచీ ముభావంగానే ఉంటున్నాడు.

జరిగిందంతా చెప్పేడు అనంతరామయ్య. పిల్లల్ని కాస్త క్రమశిక్షణలో ఉంచుకో మని సలహా ఇచ్చేడు కూడా.

"చిన్న పిల్లలు- వాళ్ళ దేం ఉంది? ఒకే క్లాసులో చదువుకుంటున్నారు కాబట్టి నోట్సు లు ఇచ్చి పుచ్చుకోవడాలు జరుగుతుంటాయి. దానికే ఇంత రాద్ధాంతం చెయ్యాలా? నువ్వే ఇంత గొడవ చే స్తే ఇక లోకం ఏమంటుంది?" నిలదీ ిస అడిగేడు శోభనా ద్రి.

తా నేం కాని మాట అన్నాడో, తా నేం గొడవ చేశాడో అర్థం కాలేదు అనంతరామయ్యకి. పిల్లలకి భయం చెప్పటంకూడా ఒక నేరమే నా?




"కొత్త బట్టలు కట్టుకుని పిల్లలు పచ్చగా కళకళ్ళాడుతూ తిరుగుతుంటే రెండు కళ్ళతో చూడలే డీ మడి ిస." లోపల్నుంచి కోడలు అందుకుంది.

తాను చే ిసన తప్పేమిటో అర్థంకాక తల పట్టుకు కూర్చుండిపోయేడు అనంతరామ య్య.

×× ×× ××

అవమాన భారంతో మనసు కుతకుత లాడి పోతోంది అనంతరామయ్యకు. పొద్దు ననగా ఇంట్లో గొడవపడి వచ్చేడు. సాయంత్రం కావ స్తోంది. ఇంతవరకూ అన్నం తినలేదు. కనీసం తిందువుగాని రమ్మని వచ్చి పిల్చిన వాళ్ళు కూడా లేరు ఇంతవరకు. అసలే పెద్ద ప్రాణం- అందునా ఆహారం లేకపోవడంతో నీరసం ముంచుకొచ్చి చమటలు కమ్ముతున్నా యి. ప్రాణం కడగట్టిపోతోంది. అయినా లెక్కచెయ్యలేదు. కానీ అపవాదు మాత్రం గుండెను పిండి పిండి చేస్తోంది. చెయ్యని నేరం నెత్తి కెత్తుకోవల ిస వచ్చింది. అస లేం జరిగిందో, లోపం ఎక్కడుందో ఎంత బుర్ర బద్దలుకొట్టుకున్నా అర్థం కావడం లేదు.

ఆ యాకోబుగాడు తనమీదే చెప్పాడంట. తానే దగ్గరుండి చేయించానని చెప్పా డంట. వాణ్ణి పట్టుకుని వాడిచేత నిజం కక్కించాలని వా డుంటున్న మాలపల్లితో సహా ఊరు ఊరంతా గాలించాడు. వాడు తన కంటికి కనిపించలేదు. ఒకవేళ తనని చూ ిస ఎక్క డికి తప్పుకున్నాడో గాని వాడి అజ మాత్రం ఇంతవరకు దొరకలేదు.

ఇన్నాళ్ళకి ఈ వయసులో తా నొక దొంగగా ముద్ర పడాల్సి వస్తంది. అందులోనూ తన సొమ్ముకి తానే దొంగ. ఇంతకన్నా ఆశ్చర్య మూ', అవమానమూ లేవు తన బతుక్కి. ఇంత మాట పడ్డాక ఇక బతికి ఉండటం కూడా ిసగ్గులేనితనమే! అయినా తన ఉప యోగం అవసరం ఇక ఎవరి కుంది? ఎవరి క్కావాలి తాను? ఉండగా ఉండగా మరొకరికి భారం కావటమే గాని మరో ప్రయోజనం లేదు తన బతుక్కి.

నమిలి పారే ిసన చెరుకుపిప్పి లాంటోడు తను. ఓపిక ఉన్నన్నాళ్ళు ఉపయోగపడ్డాడు. శరీరంలో జవసత్త్వాలు ఉడిగిపోయాయి. ఫలపుష్పాలతో నిండిన చెట్టుకి ఎవరైనా నీళ్ళు పో ిస పాదులు చేస్తారు గాని ఎండి మోడయిన చెట్టుని ఎవరు పెరట్లో ఉంచు కుంటారు, పెరికి అవతల పారేస్తారు గాని. తన గతి కూడా అంతే!

"దొంగ" అన్న ముద్ర వే ిసనందుక్కూడా తాను అంతగా బాధ పడ్లేదు. వాడు ఉదయం తన్ని అడిగేప్పుడు చూ ిసన చూపు తల్చుకుంటే కడుపులో దేవుతోంది. ఎంత హీనంగా, ఎంత తిరస్కారంగా చూశా డు తన్ని? వాణ్ణి ఈ చేతులతో ఎత్తుకున్నాడు. ఈ గుండెమీద ఆడించాడు. ఎన్ని తప్పులు చే ిసనా సమర్థించుకున్నాడు...సంబాళించు కున్నాడు...కడుపులో దాచుకున్నాడు...దాచు కుంటున్నాడు. అటువంటిది ఒకవేళ...ఒకవే ళ తానే తప్పుచే స్తే తండ్రి చే ిసన ఒక్క తప్పు సమర్థించుకోలేకపొయ్యాడా? లేకపోతే ఆ మాటే తనని మంచిగా అడిగి ఉంటే ఎంత బాగుండేది? తానేం చెప్పేవాడో? ఆ తర్వాత ఇద్దరూ కలి ిస మాట్లాడుకుని అసలు కారణం కనుక్కునేవాళ్ళు కాదా?

ఈ వయసులో...ఈ ఒంటరి బ్రతుకులో ఓదార్పు, కాస్తంత చల్లని మాటలేని జీవితం ఎంత నిరర్థకం? ఎంత దుర్భరం?

గుండెలోంచి ఎగదన్నుకొచ్చే దుఃఖానికి ఆనవాలుగా కంటినుండి నీరు సంతత ధార గా ప్రవహిస్తుంటే ఎవరూ చూడకుండా పైగు డ్డతో కళ్ళు ఒత్తుకున్నాడు. కాస్త దూరంలో గ్రామస్థులు పేకాట ఆడుకుంటున్నారు.

"బావా! ఒక్కడివే కూర్చున్నావేం?" నార య్య వచ్చి ప్రక్కనే చతికిలబడ్డాడు.

అనంతరామయ్య ఎంత మామూల్గా ఉందామని ప్రయత్నించినా కూడా నారయ్య ప ిసగట్టేడు.

"ఏం బావా, అట్టా ఉన్నావ్?" అడిగేడు.

అనంతరామయ్య మట్లాడకుండా ఏవీఁ లేదన్నట్లు తలాడించేడు.

నారయ్య రెండు నిముషాలు మౌనంగా ఉండి అన్నాడు మెల్లగా- "నిన్న సాయంత్రం ఆ యాకోబుగాణ్ణి మన శోబయ్య పట్టుకుని పొలంగట్టున తంతా ఉంటే నేనూ ఉన్నానక్కడ. అయినా గాని, బావా, అంత చాటుగా అంత బయటపడాల్సిన పనేవొఁచ్చింది నీకు?"

దెబ్బ తిన్నట్లుగా చూసేడు అనంతరామయ్య నారయ్య వంక.

"అహఁ! నే నన్నానని గాదు, బావా! అది నీ ఆస్తి- నీ ఇష్టం. వాళ్ళ ముకంమీదే తన్నినట్టు ఇంటోనే అమ్మకపొయ్యావా? ఎవ్వడడిగేవోడు నిన్ను? మే వంతా లేవూఁ? నువ్వు తిని పారేసిన తరవాతే, బావా, నీ కొడుకూ ఆ తరవాత వాళ్ళూ! నీ సొమ్ముకి నువ్వు దొంగవా ఏంటీ?" నారయ్య ఓదార్పుగానే ఆ మాటలు అంటున్నా ముల్లుతో కసుక్కున గుండెల్లో దించినట్లుగా విలవిల్లాడిపోయేడు అనంతరామయ్య.

"ఏరా, నారయ్యా! నీ చిన్నప్పట్నుంచీ నన్ను నువ్వు ఎరుగుదువు. నే నటువంటి వాడినంటే ఆఖరికి నువ్వుగూడా నమ్ముతునావా?" దీనంగా, జాలిగా అడిగేడు.

"నే ననలు నమ్మలేదు, బావా! ఆ యాకోబుగాడే అన్నాడు, నువ్వు ఆ రాత్రి కల్లంలోంచి నాలుగు బస్తాల ధాన్యం వాడిచేత చేరవేయించి సెట్టి దుకాణంలో అమ్మించావని. నేనుకూడా మొదట్లో నమ్మక రెండు తగిలిచ్చి మరీ అడిగా! ఆడు ఎన్నిసార్లడిగినా నీపేరే చెబుతున్నాడు. వా డక్క డమ్ముతుంటే కిట్టయ్యగారి పాలేరు చూశాడంట. 'ఎవరయ్యిరా'-అంటే 'అనంతరామయ్యగోరు అమ్మమన్నారు' అన్నాడంట. ఆడు ఇన్నాళ్ళకి నిన్న పొద్దుట మీ అబ్బాయితో ఏదో మాటల సందర్భంలో అంటే, ఆ యాకోబుగాణ్ణి నిన్న సాయంత్రం పట్టుకుతంతే ఈ సంగతి బయటికొచ్చింది. అయినా దీనికోసం నువ్వంతగా బాదపడాల్సిన పనేం లేదు, బావా! ఎవుడి సొమ్మో నువ్వు తిన్లేదు- ఎవుడి సొమ్మో నువ్వమ్ముకోలేదు. ఆ సొమ్ము నీదే. నువ్వేం చేసుకున్నా అడిగేవోడు లేడు. ఒకడికి బయపడాల్సిన పనీలేదు. అయినా ఈ రోజు ఇదయింది. రేపింకో టవుద్ది. అసలు కారకుణ్ణి ఎతికి పట్టుకోవాల-మీ వాళ్ళల్లో ఎవురి సహాయమూ, ప్రోద్బలమూ లేందే ఆడు ఆ దయిర్యం చెయ్యలేడు. ఆ నాల్రోజులూ కల్లంలో నువ్వే ఉన్నావు గదా..."

ఆ సంగతి ఆలోచిస్తుంటే మనవఁడు రాజారావు స్మృతిపథంలో తళుక్కున మెరిసేడు అనంతరామయ్యకి. పరిక్ష ఫీజు కట్టాలని వచ్చి ఆ రోజు తన దగ్గరే పడుకున్నాడు. వాడు ఆ రాత్రివేళ రావడంలోని ఆంతర్యం ఇప్పుడు బోధపడింది అనంతరామయ్యకు. 'పట్నంలో సరదాలకి తండ్రి ఇచ్చిన డబ్బు సరిపోకపోతే ఈ పని చేశాడన్న మాట.' అసలు కారణం దొరికింది. మనసు కాస్త తేలికపడింది.

"ఏం బావా?" రెట్టించేడు నారయ్య.

అనంతరామయ్య ఏమీ మాట్లాడలేదు. వచ్చిన నింద ఎటూ తనమీదకే వచ్చింది. గాబట్టి ఫరవాలేదు. కుర్రతనంలో సరదాలకి చాల్లేదని వా డేదో కక్కుర్తిపడి ఉంటాడు. ముందు ముందు ఎంతో భవిష్యత్తు ఉన్నవాడు. తాను నోరు జారితే, ఈ నారయ్య చెవిన బడిందంటే ఊరంతా టముకు వేస్తాడు. అందుకే మారుమాట్లాడకుండా ఊరుకున్నాడు. "ఈ సంగతి విన్నావా నువ్వు?" మరో విషయం లేవనెత్తేడు నారయ్య.

'ఏవిఁ' టన్నట్లు చూసేడు అనంతరామయ్య.

"నీ కొడుకు పొలానికి బేరం పెట్టాడు. బయానాకూడా పుచ్చుకున్నాడు..."

గుండె ఒక్కసారిగా ఫెళ్ళున బ్రద్దలైంది అనంతరామయ్యకి. ఏవయితే తాను బ్రతికి ఉండగా జరగకూడ దనుకున్నాడో, ఏదయితే అనలు వినగూడ దనుకున్నాడో అదే జరిగిపో


# కేశవర్ధిని...
## పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం



పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె

అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్దిచుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగలాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

అరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




OBM 8473/TEL

# కేశవర్ధిని
తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స్ (మద్రాసు)
మద్రాసు-600 092

తోంది.

"ఏవిఁటి నువ్వనేది?" అర్థం కానట్లు, అది అబద్ధమైతే బాగుండు నన్న నమ్మకంతో ఈసారి రెట్టించి అడిగేడు.

"అదే, బావా. ఆ కాలవగట్టంట మూ డెకరాల చెక్క లేదూ- అది అమ్మేస్తున్నాడు. షావుకారు సుబ్బయ్య దగ్గర బయానా తీసుకుని గూడా పది రోజులపైనే అయ్యిందంట. నిన్ననే నా కీ సంగతి తెలి ిసింది. రేపే రిజిస్ట్రేషన్. రేప్పొద్దున్న ఆ పనిమీదే పట్నం వెళ్ళాలని ఆ సుబ్బయ్యే అన్నాడు నాతోటి. అయితే ఈ సంగతి నీకు ఇంతవరకూ తెలియదన్న మాట..."

"ఇదిగో, నారయ్యా! ఒక చెయ్యి తక్కువైం దిగాని ఒకసారిటు వస్తావా?" అవతల పేకాట ఆడేవాళ్ళు పిల్చేరు.

"నా మాట అబద్ధమైతే ఇంటికెళ్ళి కనుక్కో మీ అబ్బాయిని." చెప్పి ఆవైపుకు వెళ్ళేడు నారయ్య.

అయిపోయింది. అంతా అయిపోయింది. సర్వనాశనమై పోయింది.వ్యవహారం ఎంతవరకూ రాకూడదనుకున్నాడో అంతవరకూ వచ్చే ిసింది. జరగకూడని అనర్థం తన కళ్ళ ముందే జరిగిపోతోంది. ఇక తానేమీ చెయ్యలేడు. ఎవర్నీ ఆపలేడు. భగవంతుడా! చేతులతో ముఖాన్ని కప్పుకుని భోరున ఏడ్వాలనిపిస్తోంది. నలుగురూ నడిచే రోడ్డుమీద పడి దొర్లి దొర్లి రోదించాలనిపిస్తోంది. ఇక ఒక్క క్షణంకూడా ఆలస్యం చేయకుండా లేని ఓపిక తెచ్చుకుని ఇంటివైపు చరచరా అడుగులు వే సేడు.


"ఊళ్ళో అప్పులు పెరిగిపోతే ఏం చెయ్యమంటావ్? వాళ్ళు రోజూ నన్ను పీక్కుతింటున్నారు. వడ్డీలు పెరిగిపోతున్నాయ్. ఈ పరి ిస్థితుల్లో నా కింత కంటే మార్గం కనిపించలేదు." ధైర్యంగానే జవాబిచ్చేడు శోభనాద్రి.

"అన లంత అప్పు లెందుకయినయ్యి? అన లప్పులు చెయ్యాల్సిన పనేమొచ్చింది నీకు? వచ్చే ఫలసాయం చాలదా? ఎట్టా తిన్నా ఇంకా మిగిలిపోతదే!" ఆవేశంతో అరిచేడు అనంతరామయ్య.

"కొంపలో తిని కూర్చునేవాడికి నీకేం తెలుస్తుంది, సంసారాన్ని నెట్టుకొచ్చేవాడికి, బయట పదిమందిలో తిరిగేవాడికి తెలిస్తుంది గాని."

"మేము సంసారాలు చెయ్యలా! పది మందిలో తిరగలా! ఈనాటికి నువ్వొక్కడివే ఉద్ధరించేవోడివి బయలెల్లావు!!" కోపంతో ఊగిపోతున్నాడు అనంతరామయ్య.

"ఛీ! ఛీ!! ఈ కొంపలో ఒక్క నిముషంకూడా మనశ్శాంతి ఉండదు నాకు." చీదరించుకున్నట్టు విసురుగా బయటి కెళ్ళిపోతూ ఆగి అన్నాడు. "జరిగే దెటూ జరిగిపోతుంది. దాన్నెవరూ ఆపలేరు. నువ్వు గొంతు చించుకున్నా ప్రయోజనం లేదు. వేళ కింత తిని ఇంట్లో పడి




ఉండు." వెళ్ళిపోయాడు శోభనాద్రి.

ఆ రాత్రంతా అనంతరామయ్య కంటిమీద కునుకు లేదు. ఆ తెల్లవార్లూ పెద్ద జాగారమే చేశాడు. తెల్లవారగానే, ఇంకా ఇంట్లో ఎవ్వరూ లేవకముందే లేచి పొలంవైపు నడిచేడు.

చీకట్లు ఇంకా పూర్తిగా విచ్చుకోలేదు. పంట పొలాలకు వదిలిన తుంగభద్ర వరవళ్ళు తొక్కుతూ పెద్ద శబ్దంతో ప్రవహిస్తోంది. ఆ కాలువగట్టునే ఉంది ఈరోజు పూర్తి హక్కులతో మరొకరి భుక్తమయ్యే తన మూ డెకరాల మడి చెక్క. మూ డెకరాలూ ఒకటే చెక్క. తన హయాంలో మొదటిసారిగా కొన్న పొలంకూడా అదే! ఇన్నాళ్ళూ తమని ఆదుకుని, కంటికి రెప్పలా కాచిన తల్లికూడా అదే! తాను పునాదిగా నిలబడి ఇంత ఆ ిస్తి కొస్త కొస్తగా పెంచుకుపోవడానికి బాట వే ిసిందికూడా ఆ పొలమే! అందుకే అదంటే తనకు ప్రాణం. అది ఈనాడు పరాయి సొత్తయిపోతోంది. తాను బ్రతికుండగానే ఇంత అనర్థం జరిగిపోతున్నాకూడా చూస్తూ చూస్తూ ఏమీ అనలేని అశక్తుడై పోయేడు. ఇంతకన్నా నరకం మనిషికి మరోటుండదు. ఈ పొలం కొనడానికి తానెంత బాధపడ్డాడో తనకు తెలుసు. రెక్కలు ముక్కలు చేసుకుని, పైసాకు పైసా కూడబెట్టి, ఆ డబ్బు చాలకపోతే తన భార్య మెడలో నగలు, ఇంట్లో కాస్త విలువగల సామాను అమ్మి కొనుక్కున్నాడు. ఆనాడు తన భార్య ఒంటిమీద నగలు తీ ిసి ఇస్తూంటే తానేమీ బాధపడలేదు. ఎందుకంటే తానేమీ వృథా చెయ్యడం లేదు. ఒకటి అమ్మినా మరొకటి కొనుక్కుంటున్నానన్న తృప్తి, ఆనందం కలిగాయి తన కా నాడు.

ఇది కొన్న తరవాతే కలి ిసి వచ్చింది తనకి. ిసిరి నడిచి వచ్చింది తన కాళ్ళ దగ్గరికి. ఈ పొలం కొన్న తర్వాత తానూ ఈ ఊళ్ళో ఒక మనిషినేనన్న ధీమా ధైర్యం పెరిగి రొమ్ము విరుచుకు తిరిగాడు ఆ రోజంతా.

కానీ ఈనాడు? కష్టమంటే ఏమిటో తెలియని ఓ అనామకుడి చేతిలోంచి జారిపోతోంది... జారిపోతోంది...పరాయి సొత్తయిపోతోంది. తన కలల పంట... తన కష్టఫలం...తన ప్రాణం...తనకి ఇప్పుడు మిగిలిన సర్వస్వం.

వణికే కాళ్ళతో ఆవైపుకి నడిచి ఆ పొలం గట్టుమీద కూర్చున్నాడు. పైరు కాస్త పెరిగి నవనవలాడుతోంది. చేతులతో పిడికెడు మట్టిని అందుకోబోయి చటుక్కున వెనక్కి లాక్కున్నాడు.

'ఛీ దుర్మార్గుడా! విశ్వాసఘాతకుడా! నువ్వింత ద్రోహం చేస్తావనుకోలేదు. నా కడుపు పంటతో నీ గరిశెలు నింపానే. నిన్ను రోజు రోజుకూ పెంచి పెద్దచేశానే! ఈనాడు నన్ను ఇంత నిర్దయగా, చేతకానివాడిలా, దిక్కుమాలిన వాడిలా వదిలేస్తా వనుకోలేదు.' ఆగ్రహంతో ఆ నేలతల్లి కుమిలి కుమిలి ఏడుస్తూ శాపం పెడుతున్నట్లుగా అనిపించింది అనంతరామయ్యకి.

దూరంగా...చాలా దూరంగా ధవళవస్త్రధారిణియైన ఓ స్త్రీమూర్తి జుట్టు విరబోసుకుని, మూర్తీభవించిన శోకదేవతలా గగనతలంనుండి వడివడిగా క్రిందికి దిగుతూ ఈ అనర్థాన్ని ఆపమని చేతులు ఊపుకుంటూ వస్తున్నట్లు ఆమె...ఆమె... తన భార్య పా...ర్వ...తి... అయినట్లు పోల్చుకున్నాడు అనంతరామయ్య.

ఇక్కడే ఈ మట్టిలో తాను, తన భార్య ఎండలో, వానలో, ఎముకలు కొరికే చలిలో రేయింబవళ్ళకీ భేదం తెలియక తమ స్వేదంతో ఈనేల తల్లిని తడిపిన రోజులు గుర్తుకువచ్చి మోకాళ్ళమధ్య తల ఆన్చుకుని ఆ నిర్మానుష్య ప్రాంతంలో చిన్నపిల్లాడిలా బిగ్గరగా ఏడ్చేడు కొంత సేపు. ఆ బురద రెండు దో ిసిళ్ళతో ఎత్తి ముఖానికీ, మిగతా ఒంటికీ పూసుకుని ఉన్మాదంతో చిందులు తొక్కేడు మరికా సేపు. ఆ బురదలో పడిపోయి దొర్లి దొర్లి ఏడ్చేడు ఇంకా సేపు.

రెండవ రోజున ఊరంతా గుప్పుమంది— అనంతరామయ్య చనిపోయేడని.

వరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్న తుంగభద్రా నదిలో పదిమైళ్ళ దూరాన లాకులవద్ద తేలేడు అనంతరామయ్య, ప్రాణం అనంతవాయువుల్లో కలి ిసిపోయి.

ఇంత అర్థాంతరంగా పోతాడని, అందునా ఇలాంటి దిక్కుమాలిన చావుతో పోతాడని ఎవరూ ఊహించలేదు.

కారణం తెలియని ఊళ్ళో జనం బుర్రలు బద్దలు చేసుకుంటున్నారు.

కాలు జారి పడ్డాడని కొందరు, కావాలని పడ్డాడని మరికొందరు ఎవరికి తోచిన ఊహలకు వాళ్ళు భాష్యం చెప్పుకుంటున్నారు.

కారణం ఏమయినా కానివ్వండి—ఏదయినా కానివ్వండి.

పాపం! అనంతరామయ్య పోయేడు. •